# ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

- నలుగురు మావోయిస్టులు మృతి
- 40 నిమిషాలపాటు భీకరపోరు
- బీజాపూర్ జిల్లాలో ఘటన

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 27: ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పులు జరిగాయి. ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతిచెందారు. తెలిసిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. బీజాపూర్ జిల్లాలోని చోటే తుంగలి అటవీప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందని సమాచారం అందుకున్న డీఆర్జీ, సీఆర్పీఎఫ్ భద్రతా దళాలు ఆ ప్రాంతంలో మంగళవారం సెర్చింగ్ ఆపరేషన్ చేస్తున్నాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి కాల్పులు ప్రారంభించారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులకు దిగారు. ఇరువర్గాల మధ్య సుమారు 40 నిమిషాల పాటు భీకర పోరు జరిగింది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూ దట్టమైన అటవీప్రాంతంలోకి పారిపోయారు. కాల్పుల విరమణ అనంతరం భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఘటనా స్థలంలో నలుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించారు. మృతుల వివరాలు తెలియరావాల్సి ఉన్నది.

## ఎన్‌హెచ్‌ఎంలో 'స్పెషలిస్ట్' నియామకాలకు మంగళం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): సర్కార్ దవాఖానల్లో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద స్పెషలిస్ట్ వైద్యుల నియామకాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఎంఈ పరిధిలో గతంలో 850 మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించడం, మరో 1,863 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయడం, తెలంగాణ వైద్య విధాన పరిషత్తు (టీవీవీపీ) పరిధిలో ఇటీవల 860 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను నియమించడంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వ దవాఖానల్లో స్పెషలిస్టుల కొరత ఏర్పడనున్నదని వైద్యవర్గాలు తెలిపాయి.

## జీఆర్‌ఎంబీ సమావేశం వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): ఏపీ అధికారుల గైర్హాజరు కారణంగా గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డు (జీఆర్‌ఎంబీ) సమావేశం వాయిదా పడింది. మంగళవారం జలసౌధలోని జీఆర్‌ఎంబీ సమావేశం జరగాల్సి ఉన్నది. తెలంగాణ అధికారులు హాజరైనా, ఏపీ అధికారులు రాకపోవడంతో వాయిదా వేశారు. గురువారం లేదా మార్చి 1న సమావేశం నిర్వహించే అవకాశం ఉన్నది.























